పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న పదో తరగతి విద్యార్థులు

రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలి

- కలెక్టర్‌కు ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలంలో పరిశ్రమల హబ్ కోసం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుండి ఓర్వకల్లు వరకు వాటర్ సప్లయ్ స్కీం కింద పైప్ లైన్ వేస్తున్నారని, భూములు పోయిన రైతులకు మాత్రం ప్రభుత్వం మొండి చేయి చూపిందని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. జి. రామకృష్ణ మాట్లాడుతూ రైతులు నష్టపోయే విషయాలు ఏమాత్రం కూడా రైతులకు తెలపకుండా, వారి అనుమతి లేకుండా భూములలో పైపులైను వేయడం ఏమిటని ప్రశ్నించారు. రైతుల భూముల్లో కెవిఆర్ కంపెనీ వారికి దౌర్జన్యంగా గుంతలు తీసి పైపులైను వేసే అధికారం ఎవరు ఇచ్చారని నిలదీశారు. భూసేకరణ అధికారి రైతుల అనుమతులు లేకుండా ఎపిఐఐసి వారికి అప్పజెప్పడం, ఎపిఐఐసి వారు కాంట్రాక్టర్ అయినా కెవిఎస్ వారికి అప్పజెప్పడం అంటే రైతుల నోట్లో మట్టి కొట్టడం కాదా అని అన్నారు. ఇదేనా రైతు ప్రభుత్వం అంటే ఇది రైతు పక్షపాతి ప్రభుత్వం అని అనుకోవచ్చా లేదా కాంట్రాక్టర్లకు కార్పొరేట్లకు అనుకూలమైన ప్రభుత్వం అనుకోవాలా అని అన్నారు. రైతుల అనుమతి లేకుండా పనులు పూర్తి చేయడం అంటే చివరిగా ఎంత ఇస్తే అంత బిచ్చగాళ్ళ మాదిరి రైతులు తీసుకోవాలా అని అన్నారు. ఇది చట్టాలను ఉల్లంఘించడం అవుతుందని, చట్ట ప్రకారం భూ సేకరణ చేయాల్సిన అధికారులు కాంట్రాక్టర్లకు సాగిలపడి రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. భూ సేకరణ చేసే సమయంలో రైతులను ఒప్పించి ఎంత నష్టపరిహారం ఇస్తున్నామనే విషయాన్ని తెలియపరచి రైతులకు భరోసా కల్పించాలన్నారు. అనేక సందర్భాలలో ఆర్‌డిఒకు, ఎపిఐఐసి వారికి వివరాలు జాయింట్ కలెక్టర్ కూడా చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. పైపు లైను కొరకు (ట్రెంచ్) తీసిన సందర్భంగా కాంట్రాక్టర్ కనీసమైన జాగ్రత్తలు తీసుకోకపోవడం చేత జులై మాసం చివరలో గుంతల నిండా నీళ్ళు నిండి వాహనదారులు గుంతల్లో పడ్డారని, కేతవరం గ్రామానికి చెందిన రైతు మేకల రంగస్వామికి చెందిన రూ.లక్ష విలువ చేసే ఆవు అందులో పడి చనిపోయిందన్నారు. గత నాలుగు రోజుల క్రితం బ్రాహ్మణ కొట్కూరుకు చెందిన గొల్లచిన్నక్రిష్ణ ఇదే గుంతలలో పడి చనిపోయాడని తెలిపారు. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని, ఒకవైపు రైతులను అన్యాయం చేయడం మరోక వైపు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి వాటిపై పూర్తిస్థాయి విచారణ జరపాలన్నారు. రైతులకు న్యాయం చేయాలని, రైతుల అనుమతి లేకుండా వేసిన పైపులను భూముల నుండి తొలగించాలని ఆయన జాయింట్ కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. రైతులకు న్యాయం చేయని పక్షంలో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని జి.రామకృష్ణ తెలిపారు. జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు మధు, శ్రీనివాసులు శెట్టి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ

ప్రశాంతంగా 'టెన్త్' పరీక్షలు

- ఇద్దరు విద్యార్థులు డీబార్ - ఉపాధ్యాయుడు సస్పెండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

టెన్త్ పరీక్షలు సోమవారం నుండి జిల్లాలో 172 పరీక్షాకేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని విద్యాశాఖ అధికారి ఎస్.శ్యామ్యూల్ పాల్ వెల్లడించారు. మొదటి రోజు పరీక్షకు 32130 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 31430మంది విద్యార్థులు పరీక్షనురాశారు. 700 మంది విద్యార్థులకు గైర్హాజరయ్యారు. పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి శామ్యూల్, జిల్లావిద్యాశాఖ అధికారి ఎస్ శ్యామ్యూల్‌పాల్ పరీక్షకేంద్రాలకు వెళ్లి పరిశీలన చేశారు. జొన్నగిరి ఉన్నతపాఠశాలలో మాస్ కాపీయింగ్ కు పాల్పడుతున్న విద్యార్థిని ఆర్‌జెడి డీబార్ చేశారు. అక్కడే పాఠశాలలోపరీక్ష రాస్తున్న సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయుడు పరీక్షకేంద్రంలో ఉండడంతో ఆర్‌జెడి అగ్రహం వ్యక్తంచేసి వెంటనే సస్పెండ్‌చేశారు. కర్నూలు నగరంలోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక మున్సిపల్ పాఠశాలలో విద్యార్థి మాస్ కాపీయింగ్ పాల్పడుతుండడంతో డిఇఒ పరిశీలన చేసి వెంటనే డిబార్ చేశారు. అక్కడ విధులను నిర్వహిస్తున్న ఇన్విజిలెటర్‌ను విధులనుండి తప్పించడమేకాక షోకాజ్ నోటిస్ జారీ చేశారు. హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కింద కూర్చొని పరీక్షలను రాయడంతో వెంటనే అక్కడ ఉన్న పంపాపతిగౌడ్, కబీర్‌లను విధులనుండి తప్పిస్తూ నేరుగా అర్జేడికి డిఇఒ సరెండర్‌చేశారు. పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలని డిఇఒ అదేశాలను జారీచేశారు. ఎక్కడైనా పొరుపాట్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

హంద్రీ వెంట మురుగు కాలువ నిర్మించాలి

- ప్రజాచైతన్య యాత్రలో సిపిఎం దృష్టికి పలు సమస్యలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మురుగునీరు హంద్రీనదిలో కలువకుండా ప్రత్యేక కాలువ నిర్మించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సోమవారం కల్లూరు అర్బన్ 32 వ వార్డు ముజఫర్ నగర్ లో సిపిఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను సిపిఎం నాయకుల దృష్టికి తెచ్చారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయి బాబా, కె సుధాకరప్ప, ఏరియా కార్యదర్శి ఎం సి ఆనందు మాట్లాడుతూ హంద్రీ నదిలో విపరీతంగా కంపచెట్లు పెరిగి అడవిగా మారిపోయిందన్నారు. అందులో అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని తెలిపారు. ముజఫర్ నగర్ లోని మురుగునీరంతా హంద్రీ నదిలో కలవడం వల్ల అక్కడ బురద ఏర్పడి పందులు దోమలు, క్రిమి కీటకాదులు మొత్తం కాలనీలోకి ప్రవేశిస్తున్నాయన్నారు. దానివల్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. హంద్రీ నదిలో ముళ్లపొదలు ఉండడంవల్ల రాత్రిపూట విష సర్పాలు కాలనీలోకి ప్రవేశిస్తున్నాయన్నారు. ఇక్కడ ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారని తెలిపారు. వెంటనే మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని ముజఫర్ నగర్ ఐఎంఎల్ డిపో నుండి కల్లూరు హంద్రీ బ్రిడ్జి వరకు హంద్రీ నది వెంట మురికి కాలువ నిర్మించి సిసి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ముజఫర్ నగర్ లో కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్న సచివాలయాలు ఖాళీ చేసి పెళ్లిళ్లకు ఫంక్షన్లకు ఉపయోగపడేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ ఉన్న వారంతా పేద ప్రజలు బయటకు వెళ్లి పెళ్లిళ్లు చేసుకోవాలంటే ఫంక్షన్ హాళ్లకు రూ.లక్షలు ఖర్చులు పెట్టే స్తోమత ప్రజలకు లేదన్నారు. వెంటనే ముజఫర్ నగర్ పార్కులో సచివాలయాలు నిర్మించి కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్న సచివాలయం ఖాళీ చేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజు, రమణమ్మ, రాణి, సీతాలక్ష్మి సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

ముజఫర్ నగర్‌లో హంద్రీ నది వెంట పర్యటిస్తున్న సిపిఎం నాయకులు, స్థానికులు

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

సచివాలయాల సేవల పట్ల అసంతిప్తి

- ఎంపిడిఒలపై కలెక్టర్ ఆగ్రహం - గ్రీవెన్సులో బాధితుల నుండి అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా అందుతున్న సేవల పట్ల జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాష అసంతృప్తి చేశారు. పెద్దడబూరు, కోసిగి, కౌతాళం, సి.బెళగల్,తుగ్గలి, హోళగుంద మండలాలు సచివాలయాల ద్వారా అందిస్తున్నసేవల్లో వెనుకబడి వున్నాయన్నారు. సదురు మండలాల ఎంపిడిఒలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పనితీరు మార్చుకోవాలని అయన ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన అడిటోరియంలో ప్రజాసమస్యలు పరిష్కార వేదిక గ్రీవెన్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాష, జిల్లాజాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్‌కలెక్టర్ చల్లాకళ్యాణి, డిఆర్ఓ వెంకటనారాయణమ్మలు బాధితులనుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిఎం కార్యాలయం నుండి వస్తున్న అర్జీలను త్వరతగతిన పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యల పట్ల అలసత్వం వహించకుండా తగు చర్యలుతీసుకోవాలన్నారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించేందుకు దృష్టి సారించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు మండలాలకు వెళ్లి పర్యటించాలన్నారు. అక్కడున్న సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అయన ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలుతీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రీవెన్సులో అయా శాఖలవారీగా వచ్చిన దరాఖాస్తులపై అయన అడిగి తెలుసుకున్నారు. పెండింగులోని దరాఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అయన అదేశించారు.

బిఆర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కల్లూరులోని బిఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బిఆర్ కాలనీ వాసులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో పాల్గొన్న పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినని పుల్లారెడ్డి కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఎస్.జహీదా బేగం, పి.శేషు, కె.శ్రీనివాసులు మాట్లాడుతూ బిఆర్ రెడ్డి కాలనీ ఏర్పడి దాదాపు 30 ఏళ్లు గడుస్తున్నదన్నారు. ఇంతవరకు మురుగు నీరు ప్రవహించేందుకు సక్రమమైన కాలువలు నిర్మించనందున ప్రజలు నరకం అనుభవిస్తున్నారన్నా రు. మురుగు ఇళ్ల చుట్టూ, ఇళ్లలోకి చేరడం, ఖాళీ స్థలాల్లో నిలవడం వల్ల పాములు దోమలు వల్ల ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని జీవిస్తున్నరన్నారు. ఈ కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. మురుగు నీరు నిలిచి ప్రజలు పడుతున్న ఇబ్బందుల ఫోటోలను ధర్నాలో ప్రదర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. 90 ఏళ్ల వృద్ధురాలు ఆవేదన ఫోటోలను కలెక్టర్‌కు చూపించారు. మురుగు నీటి సమస్యపై స్పందించిన కలెక్టర్ వెంటనే మున్సిపల్ కమిషనర్‌ను వీడియో కాన్ఫరెన్స్‌లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే మురుగు కాలువ నిర్మించాలని కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఈ ధర్నా లో కె.మధుసూదన్, ఎం రాజశేఖర్, సివి వర్మ, అలీపీరా,ఎస్.బాష పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ విసిగా ఆర్‌యు విసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ వర్సిటి ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్‌గా ఆచార్య .వెంకటబసవరావు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవలనే వైస్‌ఛాన్సలర్‌గా డివిఆర్ సాయిగోపాల్ ఉద్యోగ కాలం ముగియడంతో ఆయన స్థానంలో ఇన్‌ఛార్జీ వైస్ ఛాన్సలర్‌గా రాయలసీమ వర్సిటి వైస్‌చాన్సలర్ వి.వెంకట బసవ రావును నియమిస్తూ ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులను జారీచేశారు. క్లస్టర్ వర్సిటిలోని విసి ఛాంబర్‌లో బాధ్యతలను స్వీకరించిన అనంతరం వెంకటబసవరావు మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషిచేస్తానని పేర్కొన్నారు. వర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందు కు కృషిచేస్తానన్నారు. మూడు కళాశాలలను త్వరలోని పర్య టించి అక్కడ సమస్యలను తెలుసుకుంటానని ఆయన పేర్కొ న్నారు. విసి వెంకటబసవరావుకు రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు ప్రిన్సిపల్స్ డాక్టర్ వివిఎస్ కుమార్, డాక్టర్ ఎం.ఇందిరాశాంతి, వర్సిటి డీన్‌లు కలిసి అభినందనలు తెలిపారు.

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ యస్.రవీంద్ర బాబు, ఇతర అధికారులు

ప్రాధాన్యత క్రమంలో వసతుల కల్పన

- కమిషనర్ యస్.రవీంద్ర బాబు-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 12 అర్జీలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో వివిధ కాలనీల్లో మౌలిక వసతులను ప్రాధాన్యత క్రమంలో కల్పిస్తామని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 12 అర్జీలు రాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఇ రాజశేఖర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఇ సత్యనారాయణ, పారిశుధ్య, పర్యవేక్షణ అధికారి నాగరాజు, సూపరింటెండెంట్లు క్రిస్టోఫర్, వాజిద్, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.



టెన్త్ పరీక్షలను పర్యవేక్షస్తున్న అధికారులు

తొలి రోజు పది పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలో సోమవారం పది పరీక్షలు ప్రారంభం అయ్యాయి. మోడల్ స్కూల్, గురుకుల పాఠశాల, కొత్తకోట, సి బెళగల్ హైస్కూళ్లలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడే మండలంలోని ఈ కేంద్రాలలో సుమారు 1010 మంది విద్యార్థులు పాల్గొనాల్సి ఉండగా 998 మంది హాజరయ్యారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు.ఇక్కడే పత్తికొండ ఆర్ ఐ రమణ బాబూ, కోడుమూరు విద్యాధికారి తైమున్ బాషా, మండల ప్రత్యేక అధికారి శ్యామల పరీక్ష కేంద్రాలలో ప్రత్యేక యంత్రాంగంగా ఎస్ఐ తిమ్మారెడ్డి పర్యవేక్షణలో తనిఖీలు చేశారు.

కల్లూరులో 24 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండల పరిధిలో టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు, వనజ కుమారి సోమవారం తెలిపారు. 3798 మంది విద్యార్థులకు గాను 3774 మంది విద్యార్థులు హాజరయ్యారు. 24 మంది గైర్హాజరు అయ్యారని పేర్కొన్నారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు చోటు చేసుకోలేదని పేర్కొన్నారు.

ఆయాల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాల కళాశాలలో పనిచేస్తున్న ఆయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు జె.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న జె.నాగేశ్వరావు మాట్లాడుతూ పాఠశాలలు కళాశాలలో పనిచేస్తున్న స్కావెంజర్స్‌కు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ధరలకు అనుగుణంగా రూ. పదివేల వేతనాలు పెంచాలన్నారు. మెడికల్ లీవులు ఇవ్వాలన్నారు. పాఠశాలలో కళాశాలలో ఆయాల విధులు కాకుండా ఇతర ఆఫీసులకు డ్యూటీలు వేయించడం అన్యాయంగా ఉందన్నారు. పెండింగ్ వేతనాలు ప్రతినెల పదవ తేదీ లోపల చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాజకీయ వేధింపులు తొలగింపులు ఆపాలని సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయాల యూనియన్ నాయకులు సురేఖ మాసూం బి.స్వర్ణ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించకపోతే చలో విజయవాడకు యూనియన్ నాయకత్వంలో పిలుపు ఇస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. కలెక్టర్ స్పందించి ఈ సమస్యలన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సకాలంలో వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ఇతర పనులు చేయించరాదని, జిల్లా విద్యాశాఖ అధికారులతో ఉత్తర్వులు పంపుతామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో ఆయాల యూనియన్ నాయకులు సునీత మహేశ్వరి, నయోమిని రేష్మ, సురేఖ, ముంతాజ్ బేగం, నాగమణి, మేరీ, లక్ష్మీదేవి, లక్ష్మీ,నాగమణి, నూర్‌బీ, రాధాకృష్ణ, విజయబాబు, మాణిక్యమ్మ, గోపాలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ధర్నా చేస్తున్న ఆయాలు

ఉల్చాల గ్రామ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం ఉల్చాల గ్రామ సమస్యలు పరిష్కరించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర విజ్ఞప్తి చేశారు. సోమవారం డివైఎఫ్ఐ మండల నాయకులు ప్రకాష్, అంజితో కలిసి ఎంపిడిఒ రఘునాథ్‌కు వినతి పత్రం అందజేశారు. రాఘవేంద్ర మాట్లాడుతూ గ్రామంలో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామంలో దాదాపు 50 విద్యుత్ స్తంభాలకు లైట్లు కాలిపోయాయని అన్నారు. ఏ స్తంభానికి లైట్ కాలిపోయిందో ఆ నంబర్తో సహా ఇచ్చినా అధికారులు స్పందించ లేదన్నారు. కొత్తగా రోడ్లు వేసి మట్టి, కంకర తొలగించకుండా ప్రజలు నడవడానికి ఇబ్బందిగా మార్చారని అన్నారు. కర్నూలు ఉల్చాల ప్రధాన రహదారిని డంపు యార్డుగా మార్చేశారని పేర్కొన్నారు. దానివల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పొగ మంచుతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దాని పరిష్కారం కోసం గత సంవత్సరం వాటర్ ట్యాంకుల నిర్మాణం చేసి ప్రారంభించకుండా ప్రజల్ని ఇంకా ఇబ్బందికి గురి చేస్తున్నారని తెలిపారు. విపరీతమైన దోమలతో ఇబ్బందులు పడుతున్నా ఎలాంటి నివారణ చర్యలు చేపట్టడం లేదన్నారు. గ్రామంలో అనేక చోట్ల చెత్తాచెదారం నిండిపోయి ఉన్నప్పటికీ అధికారులు స్పందించలేదన్నారు. ఇప్పటికైనా జోక్యం చేసుకొని సమస్యను పరిష్కారం చేయాలని, లేని పక్షంలో ఆందోళన దిగుతామని హెచ్చరించారు.

కర్నూలు ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న రాఘవేంద్ర, తదితరులు

రమణీయం రంగనాథ స్వామి రథోత్సవం

ప్రజాశక్తి-మద్దికేర : మద్దికేర మండలంలోని పెరవలి గ్రామంలో శ్రీ రంగనాథ స్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం రమణీయంగా జరిగింది. భక్తుల కోలాహలం మధ్య రథోత్సవాన్ని కన్నుల విందు చేశాయి. ఉదయం స్వామివారి ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు అనంతపురం, కర్నూలు జిల్లా తో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మద్దికేర ఎస్ఐ గట్టి బందోబస్తు నిర్వహించారు.

నెల రోజులు మాంసాహారానికి దూరం : పెరవలి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా పెరవలి గ్రామస్తులు మాంసాహారానికి దూరంగా ఉంటారు. శ్రీ రంగనాథ స్వామిని భక్తిశ్రద్ధలతో స్థానిక ప్రజలు పూజిస్తారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

-జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

విలువిద్య పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా ఎస్‌పి విక్రాంత పాటిల్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఆఫీసులో ఆయన క్రీడాకారులను అభినందించని వారితో మాట్లాడారు. విలువిద్య క్రీడ ఆది మానవుడు వేటాడుటకు ఉపయోగించేవాడని, యుద్ధ రంగములోనూ, ఉపయోగేంచేవారని, నవ యుగ కాలంలో క్రీడగా రాణిస్తున్నారన్నారు. విలువిద్యలో ఎపికి చెందిన జ్యోతి సురేఖ, 720 కి 720తో ప్రపంచరికార్డు సాధించిందన్నారు. ఒలింపిక్‌లో బొమ్మ దేవర దీరజ్ పాల్గొన్నారని తెలిపారు. అనంతరం ఈ నెల 23, 24లో గుంటూరులో జరిగే జాతీయ స్థాయి పోటీలో పార్థ చంద్ర, కియానా, నేహాల్ పాల్గొంటారని కార్యదర్శి కె. నాగరత్నమయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ వంశీ కృష్ణ, సునీల్‌శెట్టి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రవీంద్ర గ్లోబల్ స్కూల్లో అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ నగర శివారులలోని రవీంద్ర గ్లోబల్ స్కూలులో 'లిటిల్ సిఇఒస్ - ఆర్జెఎస్ కోడ్‌ప్రెన్యూర్' ఈవెంట్ సోమవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్మన్ జి.వంశీధర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎం.గీతాశ్రీ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలలో ఉన్న ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి వారిని సరైన మార్గంలో నడిపితే వారి ముందు జీవితం ఎంతో ఆనందకరంగా ఉంటుందన్నారు. చిన్న వయసులోనే విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలు నేర్పితే భవిష్యత్తులో సాఫ్ట్వేర్ ,డాక్టర్ అనే పదాలు కాకుండా వీరే పదిమందికి ఉద్యోగం ఇచ్చే స్థాయికి చేరవచ్చున్నారు. ఇంత చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన రవీంద్రగ్లోబల్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం రవీంద్ర గ్లోబల్ స్కూల్ చైర్మన్ జి.వంశీధర్ మాట్లాడుతూ రాబోయే కాలంలో ఈ చిన్నారులు సొంత ఆలోచనలతో వివిధ రకాల వ్యాపారాలకు అంకురార్పణ చేసి గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఈ కార్యక్రమం బలమైన పునాది వేస్తుందని అన్నారు. పాఠశాల సిఇఒ జి. సుప్రియ, ప్రిన్సిపల్ ముంతాజ్ బేగం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

ఆదోనిలో సినీ నటి రీతు వర్మ సందడి

- చందన షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న సినీనటి రీతు వర్మ

ఆదోనిలో టాలీవుడ్ హీరోయిన్ రీతు వర్మ సందడి చేశారు. 40 ఏళ్ల అనుబంధంతో చందన షాపింగ్ మాల్, స్వర్ణ మందిర్‌ను పట్టణంలో సినీనటి రీతు వర్మ చేతుల మీదుగా సోమవారం వైభవంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మల్లప్ప, మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, ఆదోని డీఎస్పీ మర్రిపాటి హేమలత హాజరయ్యారు. హీరోయిన్ రీతువర్మ రాకతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. ప్రేక్షకులను ఉత్సాహ పరిచేందుకు ఆమె నృత్యం చేశారు. షాపింగ్ మాల్ యజమానులు మా ఊరి శ్రీనివాసరావు, సంతోష్, రామ్మోహన్ రావు, గణేష్ మాట్లాడారు. వివాహానికి కావాల్సిన డైమండ్, బంగారు, వెండి నగలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పట్టు వస్త్రాలు, మెన్, కిడ్స్‌కు వెరైటీ దుస్తులు లభ్యమవుతాయన్నారు. మహిళలకు పట్టు చీరలు, నైటీలు అన్ని రకాల వెరైటీ దుస్తులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- రోడ్డుపై సిపిఎం నాయకుల బైఠాయింపు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజాసమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పెద్దకడబూరు సచివాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. దాదాపు గంటపాటు రోడ్డుపై బైఠాయించి ప్రజాసమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న మాట్లాడారు. పెద్దకడబూరు ఎస్సీ కాలనీలో పాడు పడిన పురాతన బావి వల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అనేక సార్లు సమస్యను అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీసీ కాలనీలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 6వ వార్డులో చాలా ఏళ్ల నుంచి ప్రభుత్వ భూమిలో కొట్టాలు వేసుకున్న వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. వలసలు నివారించి ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు దేవదాసు, హనుమంతు, శ్రీనివాసులు, ఈరన్న, ఆదాం, ఆశీర్వాదం పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

- చేనేత కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం తాలూకా కార్యదర్శి బి.కాలప్ప, పట్టణ నాయకులు కె.కృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్‌కు, కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చేనేత కార్మిక రంగానికి రూ.2 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపిందని విమర్శించారు. చేనేత ఉత్పత్తులను ఆప్కో ద్వారా కొనుగోలు చేయాలని, మెడికల్ టెస్టులు ఉచితంగా చేయించాలని కోరారు. కె.లక్ష్మన్న, ఎం.రాజు, కె.వెంకటేశులు, జి.శ్రీను, ఎం.తిమ్మప్ప, ఎం.ఎల్లప్ప, కె.నాగరాజు, బి.రవి పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

- కేంద్రాలను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

పదో తరగతి పరీక్షలు సోమవారం మొదటి పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో హడావుడి నెలకొంది. అరగంట ముందుగానే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిచ్చారు. నియోజకవర్గంలో 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 3,856 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 37 మంది గైర్హాజరైనట్లు డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల సౌకర్యాలపై ఉపాధ్యాయులతో ఆరా తీశారు. **కౌతాళం**లోని 5 సెంటర్ లైన్ జిల్లా పరిషత్ హై స్కూల్ ఎ, బి, ప్రతిభ హైస్కూల్, కస్తూరిబాయి గాంధీ బాలికల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు పరీక్షలు రాశారు. మొదటి రోజు కావడంతో వివిధ గ్రామాల నుంచి పరీక్ష కేంద్రాలకు సమయానికి ముందుగానే చేరుకొని హాల్ టికెట్ నెంబర్ల ప్రకారం పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సిబ్బంది ప్రతి విద్యార్థికీ హాల్ టికెట్‌తో పాటు ప్రధాన ముఖద్వారంలోనే తనిఖీలు నిర్వహించి కేంద్రాల్లోకి అనుమతించారు. పదో తరగతి పరీక్షలకు 1,040 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 889 మంది హాజరయ్యారని ఎంఇఒ-2 శోభారాణి తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆమె వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. **దేవనకొండ** మండలంలో 16 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు ఎంఇఒ తిమ్మారెడ్డి తెలిపారు. తెర్నేకల్ హైస్కూలులో ఎ సెంటర్, బి సెంటర్, దేవనకొండ జడ్‌పి హైస్కూల్, కెజిబివి పాఠశాల కేంద్రాలకు గాను మొత్తం 823 మంది హాజరు కావాల్సి ఉండగా 807 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. **నందవరం** మండలం మొత్తం మూడు పరీక్ష కేంద్రాల్లో 433 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 424 మంది హాజరైనట్లు ఎంఇఒ రఘునాథ్ తెలిపారు. **మంత్రాలయం** మండలం మంత్రాలయం, మాధవరం గ్రామాల్లోని రెండు, రెండు కేంద్రాల్లో పరీక్షలు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 814 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 804 మంది పరీక్షలు రాశారు. సిఐ రామాంజులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రాలయంలోని శ్రీపరిమళ విద్యానికేతన్ పాఠశాలలో నరసప్ప, శ్రీనివాసులు ఎ సెంటర్, బి సెంటర్లకు పరీక్షల పరిశీలకులుగా, తిమ్మప్ప, బాలకృష్ణలు డిపార్ట్మెంటల్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించారు. మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సెయింట్ థామస్ మార్తోమా పాఠశాలలో ఎగ్జాం ఆఫీసర్లుగా రాజశేఖర్, లచ్చప్ప, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లుగా లక్ష్మన్న, ఖాజా హుస్సేన్ విధులు నిర్వహించారు. **ఆస్పరి**లో మొదటి 'పది' పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఇఒ-2 తిరుమల రావు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు, కస్తూర్బా గాంధీ, జూనియర్ కాలేజీ, విజేత స్కూల్ మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 778 మంది విద్యార్థులకు గాను 754 మంది హాజరయ్యారని తెలిపారు. **ఎమ్మిగనూరు :** గోనెగండ్లలోని మూడు పరీక్ష కేంద్రాల్లో పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షా కేంద్రాలకు వెళ్లడానికి అధికారులు జిల్లా పరిషత్ హైస్కూల్ గోనెగండ్ల నుంచి ఎపి మోడల్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ఉచిత ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేశారు. గోనెగండ్ల జడ్‌పి హైస్కూల్ నుంచి ఆయా పరీక్ష కేంద్రాల వద్దకు తరలించి తిరిగి పరీక్ష ముగిసిన తర్వాత ఉచితంగా ఈ బస్సులో యథాస్థానానికి చేరవేస్తున్నట్లు ఎంఇఒ-2 నీలకంఠ తెలిపారు. తెలుగు పరీక్షకు 627 విద్యార్థులకు గాను 617 మంది హాజరయ్యారని చెప్పారు. **హొలహర్వి**లో మూడు పరీక్ష కేంద్రాలు పరీక్షలు నిర్వహించారు. 441 మంది విద్యార్థులకు గాను 434 మంది హాజరయ్యారని ఎంఇఒ-2 శ్రీనివాసరెడ్డి తెలిపారు. **చిప్పగిరి**లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న రెండు కేంద్రాల దగ్గర పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి ఎస్ఐ సతీష్ కుమార్ పరిశీలించారు. విద్యార్థులందరూ ఒక అర్ధగంట ముందే పరీక్ష కేంద్రాల వద్ద ఉండేలా చూసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు అందుబాటులో తాగు నీరు ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. బస్టాండ్ దగ్గర విద్యార్థులందరూ తాగునీరు లేక చాలా అవస్థలు పడుతున్నారని, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.


ఆదోనిలో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

మంత్రాలయంలో...

హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎ సెంటర్‌లో 172 మంది విద్యార్థులకు గాను 165 మంది పరీక్షలు రాశారు. బి సెంటర్‌లో 174 మందికి గాను 169 మంది పరీక్షలు రాశారు. జూనియర్ కళాశాలలో 140 మంది పరీక్షలు రాశారు. కెజిబివిలో 120 మందికి గాను 118 మంది పరీక్షలు రాసినట్లు ఎంఇఒలు సత్యనారాయణ, జగన్నాథం తెలిపారు.

బెంచీలు అందుబాటులో లేవు

రెండు కేంద్రాల్లో బెంచీలు అందుబాటులో లేకపోవడంతో బెంచీలు తెప్పించడానికి సర్వ ప్రయత్నాలు చేశామని, జిల్లా అధికారులకు కూడా సమాచారం అందించామని ఎంఇఒలు తెలిపారు. ఎస్ఎంసి కమిటీలు, విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించగా బెంచీలు అందుబాటులో లేనప్పుడు మన చేతుల్లో ఏమీ లేదని, నేలపై కూర్చోబెట్టి ప్రశాంతంగా పరీక్షలు రాయిద్దామని తీర్మానించారు. విద్యార్థుల తల్లిదండ్రులైతే 'గతంలో మేము నేలపై కూర్చొని పరీక్షలు రాశాం. అదేం పెద్ద నేరం కాద'ని పేర్కొంటున్నారు. హిందీ పరీక్షకు బెంచీలు సమకూరుస్తామని ఎంఇఒ పేర్కొన్నారు.

కౌతాళంలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

నందవరంలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

చిప్పగిరిలో బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ సతీష్ కుమార్

టోపీ మారెమ్మ అవ్వ దేవస్థానంలో చోరీ

ప్రజాశక్తి - హొలహర్వి

మండలంలోని అమృతాపురం గ్రామంలో వెలసిన టోపీ మారెమ్మ అవ్వ హుండీ చోరీకి పాల్పడ్డారు. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం సిఐ రవి శంకర్ రెడ్డి, ఎస్ఐ చంద్ర సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఆలయం లోపల, ఆలయం బయట వేలిముద్రలు సేకరించారు. హొలహర్వి ఎస్ఐ చంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంప్యూటర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- ఆలూరు

ఆలూరు స్కిల్ హబ్ శిక్షణ కేంద్రంలో కంప్యూటర్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్కిల్ హబ్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ రమాదేవి, నైపుణ్యాధికారి ఆనంద్ రాజ్ కుమార్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్కిల్ హబ్ శిక్షణ కేంద్రంలో యువతకు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, ఐటి హెల్ప్ డెస్క్ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 90 రోజుల శిక్షణ కాలంలో కంప్యూటర్ స్కిల్స్, టైపింగ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, థియరీ, కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, ఐటి హెల్ప్ డెస్క్ కోర్సులకు ఇంటర్మీడియేట్, డిగ్రీ, డిప్లొమా, బిటెక్, ఎంబిఎ పూర్తి చేసిన వారు అర్హులని చెప్పారు. మరిన్ని వివరాలకు 9010003132 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

'చందన' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో చందన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా ట్రాఫిక్ సమస్యతో ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన షాపింగ్ మాల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... చందన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ప్రధాన రోడ్డు పూర్తిగా రాకపోకలను పోలీసు అధికారులు దగ్గరుండి బంద్ చేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. మండుటెండలో సుమారు 5 గంటల పాటు ట్రాఫిక్ సమస్యతో ప్రభుత్వాస్పత్రి దగ్గర నుంచి ఆర్ట్స్ కళాశాల రోడ్డు, రిలయన్స్ ట్రెండ్ వరకు ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణానికి షాపింగ్ మాల్ లాంటివి రావడం మంచిదేనని, ఈ రకంగా ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదని తెలిపారు.

సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

రాయితీ పనిముట్లను వినియోగించుకోవాలి

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వం రాయితీపై అందించే వ్యవసాయ పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతులకు ఒక్కటంటే ఒక్క సబ్సిడీ కూడా ఇవ్వలేని దుస్థితి ఉండేదన్నారు. మండల వ్యవసాయ శాఖలో రైతులకు ఇస్తున్న చేతి పంపులు, పెట్రోల్ పంపులు, ట్రాక్టర్ ఇంప్లిమెంట్స్, పవర్ టిల్లర్లపై సబ్సిడీతో కూటమి ప్రభుత్వం అందించనుందన్నారు. ప్రతి చిన్న, సన్నకారు రైతులు గ్రామాల్లో ఉన్న వ్యవసాయ శాఖ అధికారిని, మండల వ్యవసాయ శాఖ అధికారికి దరఖాస్తులు అందించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విగ్రహ ఏర్పాటుకు కలెక్టర్ అనుమతులు తప్పనిసరి

- డిఎల్‌పిఒ వీర భద్రప్ప

ప్రజాశక్తి -ఆలూరు

మండలంలోని మరకట్టు గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు కలెక్టర్ అనుమతులు తప్పనిసరి అని డిఎల్‌పిఒ వీర భద్రప్ప సోమవారం తెలిపారు. మరకట్టు గ్రామస్తుడు బజారప్ప, మరికొంతమంది గ్రామస్తులు పెట్టుకున్న వినతిలో గ్రామంలోని పంచాయతీ స్థలంలో నర్సమ్మకు చెందిన కిరాణ దుకాణం (బంకు) తొలగించి ఆ స్థలంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు కలెక్టర్ అనుమతులు ఉండాలని, పంచాయతీ పరిధిలో ఉన్న బంకును పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆక్రమణల తొలగింపుపై నిర్లక్ష్యం తగదు

- ఫిర్యాదు దారుడు గనేకంటి రఘు ఆవేదన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ఆక్రమణల తొలగింపుపై అధికారులకు నిర్లక్ష్యం తగదని గనేకంటి రఘు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.రవికి మరోసారి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 54లోని 1.46 ఎకరాల ఎల్‌ఎఫ్ రోడ్డును ఆక్రమించడం వల్ల రోడ్డు కుచించుకుపోయిందని, సర్వే నెంబరు 1లో ఉన్న పొరంబోకు భూమిని శ్రీరాఘవేంద్రస్వామి మఠం వారు ఆక్రమించారని గతంలోనే తహశీల్దార్‌కు, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, ఈ విషయంపై సబ్ కలెక్టర్ ఈ నెల 19 వరకు గడువు పెట్టారని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి ఇబ్బంది, నష్టం కలిగించే ఇలాంటి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రం అందజేస్తున్న రఘు

నేటి నుంచి గద్దరాళ్ల మారెమ్మ దేవర ఉత్సవాలు

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ మండలం గద్దరాళ్ల గ్రామంలో రెండేళ్లకోసారి మారెమ్మ దేవర ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. దేవనకొండకు మూడు కిలోమీటర్ల దూరంలో గద్దరాళ్ల గ్రామం ఉంది. మంగళవారం నుంచి ఈనెల 20 వరకు పల్లెదొడ్డి, గద్దరాళ్ల గ్రామాల్లో దేవర ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి వీరయ్య, గ్రామస్తులు సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికీ రెండు చొప్పున జంతుబలులు ఇస్తారు. మండలంలోని కరిడికొండ, బుర్రకుంట, కె.వెంకటాపురం, దేవనకొండ, నల్లచెలిమల గ్రామాల్లో మారెమ్మ దేవర ఉత్సవాలు నిర్వహిస్తారు. గద్దరాళ్ల దేవర ఉత్సవాలను తిలకించడానికి తెలుగు రాష్ట్రాల నుంచే గాక కర్ణాటక, మహారాష్ట్రలోని రాయచూరు, బెంగళూరు, బళ్లారి, ధార్వాడ, ముంబయి, హోస్పేట్ తదితర ప్రాంతాల నుంచి లక్షలాదిమంది భక్తులు హాజరవుతారు. కులమతాలకు అతీతంగా దేవర ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాలు జరిగే రోజు మారెమ్మ ఆలయం వెనుక 100 అడుగుల ఎత్తులో ఉన్న గద్దరాయి మీద గద్ద వచ్చి ఉత్సవాలను తిలకిస్తుందని గ్రామస్తుల నమ్మకం. నిష్టతో ఉన్న భక్తులకు మాత్రమే గద్ద కనిపిస్తుందని భక్తుల విశ్వాసం.

పల్లెదొడ్డి బోనాల ఊరేగింపు ప్రత్యేకత

దేవర ఉత్సవాల్లో పల్లెదొడ్డి గ్రామ బోనాల ఊరేగింపు ప్రత్యేకంగా నిగుస్తుంది. ఈనెల 19న పల్లెదొడ్డి బోనాల ఊరేగింపు కార్యక్రమం జరుగుతుంది. ఆ గ్రామంలోని ప్రతి ఇంటి మహిళ నెత్తిపై బోనం పెట్టుకొని ముందు పొట్టేలు నడిపించుకుంటూ డప్పు, వాయిద్యాలతో వెళ్తారు. ఈ దృశ్యం చూసేందుకు లక్షలాది మంది భక్తులు చూస్తారు.

గద్ద రూపంలో ఉన్న గద్దె రాయి

ఏరులై పారనున్న కర్ణాటక అక్రమ మద్యం

దేవర ఉత్సవాల సందర్భంగా కర్ణాటక అక్రమ మద్యం ఏరులై పారనుంది. గ్రామాల్లో అక్రమ మద్యాన్ని డంపు చేసుకున్నట్లు సమాచారం. ఆధ్యాత్మిక ఉత్సవాల్లో మద్యంతో చిందులు వేయనున్నారు. అక్రమ మద్యాన్ని నియంత్రించడంలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకున్నారోనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు

అత్యంత వైభవంగా జరగనున్న దేవర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా, ట్రాఫిక్ నియంత్రణకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు స్థానిక సిఐ వంశీనాథ్ తెలిపారు. ఆరుగురు సిఐలు, 12 మంది ఎస్ఐలు, 200 మంది పోలీసులు, క్రైమ్ పార్టీ, హోమ్‌గార్డులతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

మృతదేహంతో హోటల్ ముందు నిరసన

ప్రజాశక్తి - ఆదోని

కారు ప్రమాదంలో మృతి చెందిన వీరేష్ కుటుంబానికి న్యాయం చేయాలని ఆదోని ఫైవ్ స్టార్ హోటల్ ముందు మృతదేహంతో నిరసన చేపట్టిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా మృతుని భార్య సుజాత మాట్లాడారు. గురువారం ఎమ్మిగనూరు రోడ్డులో ట్రాక్టర్, కారు ఢీకొన్న ప్రమాదంలో ఆదోని మండలం నాగలాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వీరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. వీరేష్ అపస్మారక స్థితిలోకి వెళ్లారని చెప్పారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోక సోమవారం మృతి చెందారన్నారు. విమల రెసిడెన్సి ఫైవ్ స్టార్ హోటల్ యజమాని కారు ప్రమాదానికి కారణమని పోలీసు విచారణలో తేలిందని తెలిపారు. మృతునికి ఐదుగురు ఆడపిల్లలు ఉన్నారు. సంపాదించే వ్యక్తి చనిపోవడంతో ఎలా బతికేదంటూ మృతుని భార్య సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక సహాయం చేయాలని కోరితే నిర్లక్ష్యంగా వ్యవహరించారని వాపోయారు. ఆగ్రహించిన బంధువులు హోటల్ ముందు బైపాస్ రోడ్డులో సుమారు గంట పాటు ఆందోళన చేపట్టారు. సిఐలు శ్రీరామ్, రామలింగయ్య ఘటన స్థలం చేరుకొని బాధితులకు నచ్చ చెప్పారు. మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు ఇస్తామని హోటల్ యజమాని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆర్‌పి ఉద్యోగాలను అమ్మేశారు

- న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి - ఆదోని

'అధికారం మాది' అని పట్టణంలో ఉద్యోగాలు అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఆర్‌పిలు జయ, సుజాత, లక్ష్మి కోరారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్, నాయకులు నరేంద్ర యాదవ్, గౌస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2014-19 వరకు మున్సిపాలిటీలోని మెప్మాలో రిసోర్స్ పర్సన్‌గా విధులు నిర్వర్తించామని, చంద్రబాబు ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను అమలు చేసినందుకు శిక్షగా గత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం 2019లో ఆదోనిలో 29 మంది ఆర్‌పిలను నిర్ధాక్షిణంగా ఉద్యోగాల నుంచి తొలగించారని తెలిపారు. ఆర్‌పి ఉద్యోగాలు కోల్పోయిన బాధిత మహిళలు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి ఉద్యోగాలు ఇప్పించాలని కోరినా న్యాయం జరిగే పరిస్థితి లేదన్నారు. గత ఐదేళ్లు వారు కూలినాలి చేసి బతికారని తెలిపారు. ప్రస్తుతం చంద్రబాబు హయాంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆదోనిలో వారికి పోస్టులు దక్కడం లేదని చెప్పారు. ఆర్‌పిలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే పార్థసారథి గతంలో లేఖ రాసి ఇచ్చినా ఉద్యోగాలు రాలేదంటే అవినీతి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఆర్‌పి ఉద్యోగాలను రాజకీయ బ్రోకర్లు ఒక్కో పోస్టును రూ.5 లక్షలకు వైసిపి నాయకులకు, కార్యకర్తలకు అమ్ముకుంటున్నట్టు తెలిసిందని విమర్శించారు. ఎమ్మెల్యే పార్థసారథి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరి కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా బాధితులకు ఉద్యోగం లభించకపోవడం శోచనీయమన్నారు. మహిళా ఆర్‌పిలకు ఎమ్మెల్యే పార్థసారథి ఉద్యోగాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు.

నిరసన చేపడుతున్న మహిళలు

ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ఆపదలో ఉన్న కార్యకర్తకు అండగా ఉంటాం

- టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప

ప్రజాశక్తి - కౌతాళం

ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకూ టిడిపి అండగా ఉంటుందని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కుంటనహాల్ గ్రామంలో విద్యుదాఘాతంతో ఇల్లు కాలిపోయిన టిడిపి మైనార్టీ నాయకులు రఫీ కుటుంబాన్ని పరామర్శించి, రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని చెన్న బసప్ప, రమేష్ గౌడ్, మోహన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యుదాఘాతం వల్ల ఇల్లు కాలిపోవడం చాలా బాధాకరమని తెలిపారు. ఇలాంటి కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని రఫిక్‌కు సూచించారు. తాము అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని తెలిపారు. అలాగే టిడిపి ప్రభుత్వంలో కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. టిడిపి నాయకులు దొడ్డ బసన్న గౌడ్, మైనార్టీ నాయకులు రెహమాన్, సిద్ధు, రాజబాబు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ పుల్లయ్య

హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వం చేయూత : ఎంపిడిఒ

ప్రజాశక్తి - నందవరం

మండలంలో గల 262 మంది హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వం చేయూతను అందించిందని ఎంపిడిఒ పుల్లయ్య తెలిపారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలను నిర్ణయించిందని, మెటీరియల్ కాస్ట్ పెరగడం వల్ల లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవడానికి ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని చెప్పారు. లబ్ధిదారుల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం వారి ఇళ్ల నిర్మాణం ఆదనంగా అమౌంటు పెంచినట్లు తెలిపారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చెంచులకు రూ.లక్ష చొప్పున పెంచినట్లు చెప్పారు. మండలంలో గల 262 మంది లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని తెలిపారు.

మంత్రాలయంలో...

మంత్రాలయం : పిఎంఎవై అర్బన్ ఎన్‌టిఆర్ స్వగృహ పథకం కింద గత వైసిపి ప్రభుత్వంలో మంజూరై నిర్మాణం పూర్తి కాని ఇళ్లకు ప్రభుత్వం నుంచి అదనంగా ఆర్థిక సహాయం అందిస్తుందని హౌసింగ్ డిఇ లాలీ కృష్ణయ్య తెలిపారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతేడాది డిసెంబర్ 10 కంటే ముందు జగనన్న కాలనీలో మంజూరైన ఎన్‌టిఆర్ స్వగృహగా పేరు మార్చి విడతలవారీగా మంజూరు అవుతుందని చెప్పారు.

శివ కిరణ్ ట్రేడర్స్ యజమానిపై చర్యలు తీసుకోవాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - నందవరం

నాగలదిన్నె గ్రామంలో గల శివకిరణ్ ట్రేడర్స్ యజమానిపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు దేవపుత్ర డిమాండ్ చేశారు. సోమవారం ఎడిఎ ఖాద్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శివకిరణ్ ట్రేడర్స్ యజమాని ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. రైతులకు అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తున్నారని చెప్పారు. అధిక ధరలకు అమ్మినా, బిల్లులు మాత్రం ప్రభుత్వ ధరలకు రాసి రసీదులను ఇస్తున్నారని తెలిపారు. రైతులు యూరియా, ఎరువులను అడిగితే ఇవ్వడం లేదని చెప్పారు. దానికి తోడుగా లిక్విడ్ గాని, బలం మందుగాని తీసుకోవాలని, అలా అయితేనే యూరియా ఇస్తామని చెప్పి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకొని షాపు లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వామిదాసు, హనుమంతు, రైతులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P. No : 55/2024

మద్దూరి మాధవి .. వాది

వర్సస్

నల్లబోతుల వెంకట నారాయణ మరియు తొమ్మిది మంది ఇతరులు .. ప్రతివాదులు

టు,

ప్రతివాది చిరునామా

8వ ప్రతివాది)

ఎస్.కే. హుస్సేన్ సాహెబ్ తండ్రి తెలియదు, ముస్లిం, వయసు సుమారు 60 సంవత్సరాలు, వ్యవసాయం, నివాసం బైనపల్లి, విల్లగె, బేతంచెర్ల మండలం, కర్నూల్ జిల్లా.

పై నెంబరు దావాలో వాది దావా ప్లైంటు పరిహారం రాగోరి మీ పై మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 24వ తేదీ మార్చి నెల 2025 సం: లో ఉన్నది. మీరు ఆ వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేని చో మీ పరోక్షమునందు దావా విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 16-03-2025

ఇట్లు
శ్రీ షేక్ యాసిన్ బాషా,
వాది తరుపు అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం. 9346513649